క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మంగళగౌరి వ్రతం

బద్వేలు అర్బన్ : స్థానిక సబ్‌జైలు సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయంలో నిజశ్రావణమాసం మొదటి మంగళవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మంగళగౌరి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసంలో వచ్చే తొలి మంగళవారంలో మంగళగౌరి వ్రతం ఆచరించడం సాంప్రదాయమని వేదపండితులు ప్రదీప్‌కుమార్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తొలుత అమ్మవారికి కలశపూజ నిర్వహించిన అనంతరం మంగళగౌరి వ్రతాన్ని ప్రారంభించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయంలోని అమ్మవారిని పసుపు, కుంకుమ ప్యాకెట్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారి ప్రతిష్ట వార్షికోత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో బుధవారం వాసవీ మాత ప్రతిష్ట వార్షికోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి వేకువజామున సుప్రభాత సేవతో మొదలుకుని మంగళహారతి, గణపతి, రుద్రహోమం, నవగ్రహ చండీ హోమం పూర్ణాహుతి తదితర పూజాకార్యక్రమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. అలాగే విశేషంగా అమ్మవారి మూలవిరాట్‌ను వజ్రపుచీర, కిరీటంతో అలంకరించనున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు పోవాలి



మాట్లాడుతున్న సాయిహర్షిత

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు పోవాలని డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగానికి ఎంపికై నా సాయిహర్షిత పేర్కొన్నారు. స్థానిక సాయిరాజేశ్వరి కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో సాయిహర్షితను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఏజీఎం నాగిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య, వైస్ ప్రిన్సిపాల్ వీణాకుమారి, అకడమిక్‌డీన్ జనార్ధన్, సిబ్యాచ్ ఇన్‌చార్జ్ విశ్వనాథ్, ప్రైమరీ ఇన్‌చార్జి రాజీవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మైదుకూరు : సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ సీఎఫ్ఎల్ కౌన్సిలర్ పి.శివకుమార్ అన్నారు. మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు, అధ్యాపకులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ విద్యాలక్ష్మి పోర్టల్ ఆవశ్యకత, సౌలభ్యం గురించి వివరించారు. విదేశీ విద్య లక్ష్మి పోర్టల్ వల్ల లాభాలను, జనధన్ యోజన, ఆధార్ ఆధారిత చెల్లింపులు బీమ్ యాప్, ఈ–వ్యాలెట్, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైం నేరాలు ఎలా, ఎన్ని రకాలుగా జరుగుతున్నాయి, ప్రభుత్వం యువతకు అందిస్తున్న వివిధ వృత్తి విద్య శిక్షణ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

విజ్ఞాన సందర్శన ఉపయుక్తం

మైదుకూరు : విద్యార్థులకు విజ్ఞాన సందర్శన ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త శ్రీవిద్యారాణి అన్నారు. మంగళవారం కదిరి బాబురావు ఉద్యాన కళాశాల విద్యార్థులు విజ్ఞాన సందర్శన కోసం కేవీకేకు వచ్చారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త విద్యారాణి మాట్లాడుతూ పాఠ్యాంశాల్లోని విషయాలను తెలుసుకునేందుకు విజ్ఞాన సందర్శన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు విద్యార్థులకు పంటల సాగు, పశుపోషణ తదితర అంశాల గురించి వివరించారు. కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంపై దృష్టి సారించాలి

బద్వేలు అర్బన్ : పెరటి తోటల పెంపకంపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంతి తెలిపారు. మండలంలోని బయనపల్లెలో సమీకృత వ్యవసాయ పద్ధతులపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో రెండవ రోజైన మంగళవారం ఆమె కోళ్ళు, గొర్రెలు, మేకల పెంపకం, పెరటి తోటల ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు.

సంపూర్ణ ఆరోగ్యానికి మంచి పోషకాలు ఉన్న పండ్లు, కూరగాయలు తీసుకోవడం ఉత్తమమన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా కో ఆర్డినేటర్ నాగసుబ్బరాయుడు, కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ టి.మహేష్‌బాబు, పశువైద్యాధికారి డాక్టర్ పవన్, వాటర్‌షెడ్ పీఓ వేణుగోపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

దువ్వూరు : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మండలంలోని జిల్లెల్ల సచివాలయ పరిధిలోని పెద్దబాకరాపురం గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల కోసం ఎవరికైనా డబ్బులు ఇస్తున్నారా అని ఎమ్మెల్యే అడుగగా రూపాయి కూడా ఎవ్వరికి ఇవ్వలేదని, అమ్మ ఒడి, రైతు భరోసా, పంటల ఇన్సూరెన్స్ పథకాలు నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లో పడుతున్నాయని మహిళలు ఎమ్మెల్యేకు వివరించారు. మా గ్రామానికి రోడ్డు లేదని, 20 ఏళ్ల క్రితం మీరే రోడ్డు వేశారని రోడ్డు వేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. త్వరలోనే మీ ఊరికి రోడ్డు మంజూరవుతుందని, తానే రోడ్డుకు శంకుస్థాపన చేసి ప్రారంభిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇంటి స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునేందుకు ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ పాలనను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చారన్నారు. పేదలకు సాయం చేయాలని, అండగా నిలబడాలనే పెద్దమనసు జగన్‌ది అని అన్నారు. సీఎం జగన్‌ను మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. నాలుగేన్నరేళ్లలో తాము చేసిన సంక్షేమం, అభివృద్ధిని గడప గడపకు వెళ్లి వివరిస్తుంటే ప్రతిపక్ష నేతలు జీర్ణించుకోలేక కడుపు మంటతో ఏవేవో మాట్లాడుతున్నారన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారన్న విషయాన్ని వారు గుర్తు పెట్టుకోవాలన్నారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ కృష్ణయ్య, సచివాలయ కన్వీనర్ శంకర్‌రెడ్డి, నాయకులు లక్ష్మిరెడ్డి, కామాక్షిరెడ్డి, వీవీ స్వామి, బి.వెంకటసుబ్బారెడ్డి, వీరారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఓబుళరెడ్డి, సహకారం సంఘం అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, గోపాల్‌రెడ్డి, మిద్దె రసూల్ గౌస్, చిరాకి గౌస్ బాషా, బందేఖాన్, చెన్నరాయుడు, శ్రీకాంత్, తహసీల్దార్ రమకుమారి, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుకు స్థలాన్ని పరిశీలించిన జేసీ



పెట్రోల్ బంకు స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ గణేష్‌కుమార్

ప్రొద్దుటూరు : రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంకు కోసం స్థలాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ప్రొద్దుటూరు మండల రెవెన్యూ కార్యాలయం పరిధిలోని అగ్నిమాపక కేంద్రం ఆవరణలో మెయిన్ రోడ్డుకు పెట్రోలు బంకును ఏర్పాటు చేసేందుకు 20 సెంట్లస్థలాన్ని కలెక్టర్ మంజూరు చేశారు. భారత్ పెట్రోల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఈ స్థలాన్ని జేసీ పరిశీలించారు. తమకు రెండో వాహనం మంజూరైందని ఫైర్ ఆఫీసర్ రఘునాథ్ జేసీకి తెలపగా, మండల వ్యవసాయ శాఖ కార్యాలయ పరిధిలోని కొంతస్థలాన్ని కేటాయిస్తామన్నారు. జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్‌లో తొలిమారు రెవెన్యూశాఖ పరిధిలో పెట్రోల్ బంకును ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే తూనికలు కొలతల శాఖ కార్యాలయానికి 5 సెంట్ల ప్రభుత్వ స్థలం మంజూరు చేయాలని కోరగా గోపవరం గ్రామ పంచాయతీ హౌసింగ్ బోర్డులో పరిశీలించారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన జేసీ చుక్కలు, ఇనాం భూముల ఆన్‌లైన్ విధానాన్ని స్వయంగా పరిశీలించారు. ఏవైనా సాంకేతిక అభ్యంతరాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నజీర్‌అహ్మద్, డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డి, సుదర్శన్, సతీష్, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు

మైదుకూరు : ఆధార్ కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం మండలంలో ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి తెలిపారు. ఈనెల 24న మిట్టమానుపల్లె, తవ్వపల్లె సచివాలయాల్లో ఆధార్‌ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. 25న ఆదిరపల్లె, ఎస్.ఎర్రబల్లె సచివాలయాల్లో ఈ శిబిరాలను నిర్వహిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శ్రావణ మాసంలో ప్రత్యేక బస్సులు

మైదుకూరు : శ్రావణ మాసం సందర్భంగా మైదుకూరు డిపో నుంచి అనంతపురం జిల్లాలోని ప్రసిద్ధ ఆంజనేయస్వామి ఆలయాలకు ప్రత్యేక బస్సులను నిర్వహిస్తున్నట్టు మైదుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. శ్రావణ మాసంలో మంగళ, శనివారాల్లో అనంతపురం జిల్లాలోని కసాపురం, మురడి, నేమకల్లు క్షేత్రాలకు ఈ బస్సు సర్వీసులు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈనెల 26న శనివారం, 29న మంగళవారం, సెప్టెంబర్ 2న శనివారం, 4న మంగళవారం, 9న శనివారం, 12న మంగళవారం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను ఆంజనేయస్వామి క్షేత్రాలకు నడుపుతున్నట్టు తెలిపారు. రిజర్వేషన్‌తో కలిపి ఒక్కొక్కరికి రూ.1,270 టికెట్ ధర ఉంటుందని, మంగళవారం, శనివారాల్లో ఉదయం 5.30 గంటలకు మైదుకూరు డిపో నుంచి బస్సు బయల్దేరి రాత్రి 10 గంటలకు తిరిగి చేరుకుంటుందన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలి



వివరాలు వెల్లడిస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ కృష్ణవేణి

గోపవరం : మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అన్నిశాఖల అధికారులు సమన్వయంతో దృష్టిపెట్టాలని మండల అధ్యక్షురాలు ధనలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిపై సమావేశంలో వివరించారు. తహసీల్దారు మాట్లాడుతూ కొన్ని చౌకదుకాణాల్లో కార్డుదారులు ఎక్కడ పడితే అక్కడ రేషన్ తీసుకోవడం వలన పర్సెంటేజీ శాతం తగ్గిపోతుందని, వీలైనంత వరకు కార్డుదారులందరూ వారికి కేటాయించిన చౌకదుకాణాల్లోనే రేషన్ తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మండలంలో భూముల రీసర్వే జరుగుతుందని, సంబంధిత రైతులు వారి భూముల వివరాలను సర్వే సిబ్బందికి దృష్టికి తీసుకెళ్లి సర్వే చేయించుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవితేజ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులను వెంటనే మొదలు పెట్టాలన్నారు. ఒక్కో గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు ప్రభుత్వం కేటాయించిందని, ఈ నిధులను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులకు ఉపయోగించడం జరుగుతుందని, పనులు పూర్తి చేసిన వెంటనే బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. తాగునీటి కోసం రూ.3.14 కోట్లు మంజూరు కాగా కేవలం రూ.80 లక్షలు పనులు మాత్రమే జరుగుతున్నాయని, మిగిలిన నిధులు టెండర్ దశలోనే ఉన్నట్లు ఆయన తెలిపారు. మండలంలో మొదటి విడతలో 465 ఇళ్ళు మంజూరు కాగా 354 ఇళ్ళు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. ఎంపీడీఓ హరినారాయణ, ఎంఈఓ చెన్నయ్య, ఏఓ అరవిందనాయక్, పశువైద్యాధికారి డాక్టర్ కృష్ణవేణి, ఈఓపీఆర్‌డీ హసీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మిదేవి, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీగా ఎంపికైన శివప్రియరెడ్డికి సన్మానం



శివప్రియరెడ్డి దంపతులను సన్మానిస్తున్న కరస్పాండెంట్ కె.కృష్ణప్రదీప్‌రెడ్డి

ప్రొద్దుటూరు : గ్రూప్–1 పరీక్షలో ప్రతిభ చూపి డీఎస్పీగా ఎంపికై న శివప్రియరెడ్డిని స్థానిక గోపికృష్ణ హైస్కూల్‌లో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కె.కృష్ణప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ ఎర్రగుంట్ల పట్టణానికి చెందిన అంకిరెడ్డిపల్లె రామశేఖర్‌రెడ్డి, విజయలక్ష్మి దంపతుల కుమార్తె శివప్రియరెడ్డి పదో తరగతి వరకు గోపికృష్ణ స్కూల్‌లో చదివిందన్నారు. ఆమె బీటెక్ తర్వాత సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ 2018లో తొలి ప్రయత్నంలో గ్రూప్–1 పరీక్షలో విజయం దక్కలేదన్నారు. 2022లో గ్రూప్–1 పరీక్షకు హాజరై ప్రిలిమినరీ, మెయిన్స్ ఇంటర్వ్యూలో ఉత్తీర్ణత సాధించి డీఎస్పీ పోస్టుకు ఎంపికయ్యారన్నారు. అనంతరం శివప్రియరెడ్డి, మణికాంత్‌రెడ్డి దంపతులను, ఆమె తండ్రి రామశేఖర్‌రెడ్డిలను హైస్కూల్ కరస్పాండెంట్ ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ భర్త, అత్తమామలు మల్లేశ్వర్‌రెడ్డి, సరస్వతిలు ప్రోత్సహించారన్నారు. కార్యక్రమంలో కె.సందీప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గంగయ్య, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివప్రియరెడ్డికి అభినందనలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక షిర్డిసాయి జూనియర్ కాలేజి పూర్వ విద్యార్థి ఎ.శివప్రియరెడ్డి డీఎస్పీగా ఎంపికై న సందర్భంగా ఆమెను కాలేజిలో మంగళవారం సన్మానించారు. కాలేజి ప్రిన్సిపాల్ శివారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు ఇద్దరు గ్రూప్–1లో ప్రతిభకనబరిచి డీఎస్పీగా శివప్రియరెడ్డి, డిప్యూటీ కలెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఉద్యోగాలు సాధించారన్నారు. వీరిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.

ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

అట్లూరు : ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ సుజాతమ్మ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆమె వ్యాయామ ఉపాధ్యాయులతో సామావేశమై మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలలో 17 సంవత్సరాలకు పైబడిన యువతీ యువకులు పాల్గొనవచ్చన్నారు. అనంతరం క్రీడా కారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టడం జరుగుతుందన్నారు.

కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని మంగళవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తెలిపారు. కరోనా సమయంలో తీసుకున్న కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఈనెల 24న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చంటి, సాల్‌మోన్, విజకుమార్, రాఘవేంద్ర, రమాదేవి, రవణమ్మ, గురమ్మ, నీతమ్మ, అన్నపూర్ణ, సురేష్ పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం తేవాలి



కరపత్రం విడుదల చేస్తున్న జేవీవీ నాయకులు

పోరుమామిళ్ల : సమాజంలో చదువులేని వారితో పాటు చదువుకున్న వారు కూడా మూఢ నమ్మకాలకు బలై పోతున్నారని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ఏడీ దేవదత్తం తెలిపారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జేవీవీ మండల ప్రధాన కార్యదర్శి గఫార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ నరేంద్ర దభోల్కర్ జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా నిర్వహించిన ఈ సమావేశంలో సైంటిఫిక్ టెంపర్ గురించి చర్చించారు. సమావేశంలో దేవదత్తం మాట్లాడుతూ చంద్రయాన్–3 విశ్వంలోకి విజయవంతంగా దూసుకెళుతున్న సమాజంలో మూఢనమ్మకాలను ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. సైన్స్ వ్యతిరేకశక్తులు మూఢనమ్మకాలను ప్రచారం చేస్తున్నాయన్నారు. సైన్స్ తగ్గిపోయిన కొద్దీ చాందసవాదం ప్రబలుతుందని, హేతువాదం కనుమరుగవుతుందన్నారు. మహారాష్ట్రకు చెందిన వైద్యుడు, రచయిత, మేధావి, భారతీయ హేతువాది మూఢనమ్మకాలకు, అంధ విశ్వాసాలకు వ్యతిరేకంగా గళం విప్పి అవిశ్రాంతంగా పోరాడాడని, 1980లో వైద్య వృత్తిని వదిలి మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, ప్రజల్లో ఉన్న అజ్ఞానాన్ని రూపుమాపేందుకు కృషి చేశారని, సైంటిఫిక్ టెంపర్ గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేశారని, అలాంటి వ్యక్తిని 2013లో హత్య చేశారన్నారు. మరుసటి రోజే మహారాష్ట్ర ప్రభుత్వం మూఢనమ్మకాల నిర్మూలన ఆర్డినెన్స్ ద్వారా అమలుల్లోకి తెచ్చిందన్నారు. కర్నాటక ప్రభుత్వం కూడా చట్టం చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా రాష్ట్ర ప్రభుత్వం మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం అమలు చేయాలని ఆయన కోరారు. సమావేశంలో పాల్గొన్న రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, గఫార్, జిల్లా నాయకులు ఖాశింపీరా, సుందరయ్య, గణేష్ తదితరులతో కలసి దేవదత్తం సైంటిఫిక్ టెంపర్ కరపత్రాన్ని విడుదల చేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

బ్రహ్మంగారిమఠం : మండలంలోని పలుగురాళ్ళపల్లె జిల్లాపరిషత్ హైస్కూలలో మంగళవారం రాష్ట్ర ఫుడ్‌కమీషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి మధ్యాహ్న భోజనంను పరిశీలించి భోజనంపై విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఇస్తున్న మెనూ ప్రకారం వంట ఏజన్సీ, ప్రధానోపాధ్యాయుడు దగ్గర ఉండి అందించాలన్నారు. హాస్టల్‌లో కూడా విద్యార్థులకు వార్డెన్లు మెనూ ప్రకారం అందించకుంటే అటువంటి వార్డెన్లపై చర్యలు తప్పవన్నారు. అనంతరం అక్కడే విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

బి.ఎస్.నారాయణరెడ్డికి అవార్డు

కాశినాయన : మండలంలోని మిద్దెల గ్రామానికి చెందిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్, సంఘ సేవకులు బి.ఎస్.నారాయణరెడ్డి ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం లైఫ్‌టైమ్‌అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల మన్ననలు పొందారు. ఆయన సేవలను గుర్తించిన అభిలాష్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సరోజనమ్మ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నారాయణరెడ్డి తెలిపారు. ఈ నెల 27వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని వి.రాజుపాళెం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ తెలిపారు.

గ్రామంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో 104 వాహనం ద్వారా అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేయటం జరుగుతుందని, గ్రామస్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

పాఠశాల అభివృద్ధికి కృషి



మొక్కలు నాటుతున్న కౌన్సిలర్ ఇందిరా రమణి నాగయ్య దంపతులు

మైదుకూరు : మైదకూరు ఎస్సీ కాలనీ (గడ్డమాలవాడ)లోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి కృషి చేయనున్నట్టు 11వ వార్డు కౌన్సిలర్ పిల్లి ఇందిరా రమణి తెలిపారు. మంగళవారం పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణలో కౌన్సిలర్ మొక్కలు నాటారు. జగనన్న గోరుముద్ద పేరుతో పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి స్వయంగా విద్యార్థులకు వడ్డించారు. ఈ సందర్భంగా ఇందిరా రమణి మాట్లాడుతూ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి కృషితో పాఠశాల అభివృద్ధికి మనబడి నాడు–నేడు కింద రూ.22 లక్షల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ నిధులతో పాఠశాలకు ప్రహరీ, తరగతి గదుల రిపేర్లు, తాగునీటి సౌకర్యం, ఫర్నీచర్ సమకూరనున్నట్టు వివరించారు. ప్రస్తుతం పాఠశాలలో 51 మంది విద్యార్థులు ఉన్నారని, ఈ సంఖ్య మరింత పెరిగేందుకు తల్లిదండ్రుల్లో అవగాహన కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ పిల్లి నాగయ్య, ఉపాధ్యాయులు అలెక్సిస్, రవి ప్రకాష్ పాల్గొన్నారు.